





వేంకటేశ్వర ఆలయంలో తిరుచ్చి ఉత్సవం

కొడంగల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఉట్ల ఉత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పురోహితులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి.. సందర్శకుల సందడి

మత్తడి దూకిన కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు రావటంతో ఆదివారం ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. సందర్శకులు ప్రాజెక్టు అలుగు నీటిలో దిగి సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. ఒడ్డు నుంచి ప్రాజెక్టు అందాలను తిలకించారు. కొంతమంది సందర్శకులు ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు.

- ధారూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి)



కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న సందర్శకులు, (ఇన్‌సెట్‌లో)మత్తడి వద్ద సందడి



సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ముదిరాజ్‌లను బీసీ - ఏలో చేర్చాలి


ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్న ముదిరాజ్‌లను బీసీ - డీ నుంచి బీసీ - ఏలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు సత్యపాల్, తుడుం శ్రీనివాస్, మెరుగు వెంకటయ్య, బోయిని వెంకటయ్య, ఊరడి నారాయణ, నర్సప్ప, నర్సిములునాయుడు, బాలయ్య తదితరులు కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ముదిరాజ్‌లను బీసీ - ఏలోకి మారుస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం అందించాలని సూచించారు. ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండల కేంద్రాల్లో ముదిరాజ్ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జయరాములు, శ్రీకాంత్, పకీరప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

8

తాండూరు-వికారాబాద్ మార్గంలో అసంపూర్తిగా రోడ్డు



పోస్టుపోన్!

నామినేటెడ్ పదవుల భర్తీ ఇప్పట్లో లేనట్టే..

- 'స్థానిక' ఎన్నికల నేపథ్యంలో నియామకాలకు బ్రేక్
- గత నెలలోనే ముగిసిన గడువు
- ఆశావహులకు తప్పని ఎదురుచూపులు
- పాత వారితోనే ఎన్నికలకు...

కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీకి బ్రేకులు పడ్డాయి. గత నెలలోనే వీటి నియామకం చేపట్టాల్సి ఉన్నా అధిష్ఠానం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. ఎన్నికల సమయంలో పదవులు భర్తీ చేస్తే కొందరు అసంతృప్తికి లోనయ్యే ప్రమాదముందని ప్రస్తుతానికి ఆ ప్రక్రియను ఆపేసింది. దీంతో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంకా పదవులు రాకపోవడంపై ఆశావహులు నిరాశ చెందుతున్నారు.

తాండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత పదవుల పందేరానికి బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జులై 17వ తేదీలోగా పదవులను భర్తీ చేయాల్సి ఉంది. కానీ అధిష్ఠానం వాటి ఊసే ఎత్తడం లేదు. దీంతో ఆశావహులకు ఎదురు చూపు తప్పడం లేదు. మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మిగతా 7వ పేజీలో...



టీఆర్‌ఆర్‌కు దరఖాస్తులు అందజేస్తున్న ఆశావహులు (ఫైల్)

తప్పని ఎదురు చూపులు

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలకు మరో ఆరు నెలలు ఎదురుచూపులు తప్పేలా లేవు. ఉమ్మడి జిల్లాలో కొన్ని ప్రాంతాలకు మినహా మిగతా ప్రాంతాల్లో ఈ పోస్టులు భర్తీ కాలేవు. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు కొందరు నామినేటెడ్ పదవులపై ఆశ పెట్టుకున్నారు. కొందరు స్థానిక పదవులు ఆశిస్తుండగా, మరికొందరు రాష్ట్రస్థాయిలో కోరుకుంటున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, పంచాయతీలు, మునిసిపాలిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలు ముగిసే వరకు ఆరు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు పదవుల భర్తీ ప్రక్రియ చేపట్టే అవకాశం లేదని తెలుస్తోంది.



జూనియర్ అసిస్టెంట్ నరేందర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తాగిన మత్తులో కీచకం

- కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ నిర్వాకం
- చిన్నారుల పట్ల అసభ్య ప్రవర్తన
- పోక్సో కేసు నమోదు

వికారాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ ప్రభుత్వ ఉద్యోగి చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వివరాలిలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ కలెక్టరేట్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో పరిగి ప్రాంతానికి చెందిన నరేందర్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ప్రభుత్వ సెలవు ఉన్నా కలెక్టరేట్‌లో నుంచి తాగిన మైకంలో బయటకు వచ్చాడు. వస్తూ వస్తునే కలెక్టరేట్ గేటు లోపల ఆడుకుంటున్న స్థానిక చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఎనిమిదేళ్ల బాలిక పట్ల కీచకంగా వ్యవహరించాడు. ఇష్టానుసారంగా పిల్లలను తాకడం, పట్టుకోవడం చేస్తుండడంతో సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. భయపడ్డ పిల్లలు బయటకు పరుగులు తీసి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పారు. స్థానికులు, పిల్లల తల్లిదండ్రులు రావడాన్ని గుర్తించిన నరేందర్ కలెక్టరేట్ గార్డెన్‌లోకి పరుగులు తీసి చెట్ల పొదల్లో దాక్కున్నాడు. తల్లిదండ్రులు గాలించి పట్టుకొని చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని కిచక ఉద్యోగి నరేందర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు నరేందర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

ఓ మై డాగ్



ఒకేరోజు 23 మందిని కరిచిన వీధి కుక్కలు

ఒక్క పరిగిలోనే 16 మందిపై, కొడంగల్‌లో ఏడుగురిపై దాడి

దడ పుట్టిస్తున్న గ్రామ సింహాలు.. ఆస్పత్రుల్లో మందులు, వ్యాక్సిన్ లేక రెఫర్

పట్టించుకోని మున్సిపల్, పంచాయతీ అధికారులు



పరిగి: వికారాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరిగికి చెందిన షరీఫ్, హబీబ్

పరిగి/కొడంగల్/బషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ సింహాలు దడ పుట్టిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులకు దిగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే పరిగి పట్టణంలో 16 మందిపై, కొడంగల్‌లో ఏడుగురిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. పరిగి మునిసిపల్ పరిధికి చెందిన 16 మందిని వీధి కుక్కలు కరిచి గాయపర్చాయి. ఖాన్‌కాలనీ, మార్కెట్‌యార్డు ప్రాంతంలో ఈ ఘటనలు జరిగాయి. కుక్కల దాడిలో గాయపడిన వీరందరినీ పరిగిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో తాండూరుకు తరలించారు. అక్కడా మందులు లేకపోవడంతో వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. కుక్కకాటుకు మందులు లేకపోవడంపై మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, బీఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌రెడ్డి, ఎం.అశోక్, ఎస్.భాస్కర్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి వైద్యాధికారులను నిలదీశారు. డ్యూటీలో ఉన్న డాక్టర్ హారిక కుక్కకాటుకు సంబంధించి వ్యాక్సిన్ అందుబాటులో లేదని తెలిపారు. ఒక్క జూలై మాసంలో 250 కుక్కకాటు కేసులు వచ్చాయని, ఆగస్టులో ఇప్పటివరకు 158 కేసులు వచ్చాయని చెప్పారు. కుక్కల బెడద నుంచి రక్షించాలని ఎన్నోసార్లు మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున మున్సిపల్ కార్మికుడు జోగు అనంతయ్య

మిగతా 8వ పేజీలో...



పరిగిలో చికిత్స పొందుతున్న ఖాజాపాషా

మందులు అందుబాటులో ఉంచాలి

పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్కకాటుకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆదివారం పరిగి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కుక్కకాటు బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందులు లేకపోవడంపై డీసీహెచ్‌వో ఆనంద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం ఉదయం నాటికి మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరిగి ఆస్పత్రికి వచ్చే ఏ రోగిని ఇతర దవాఖానలకు రెఫర్ చేయొద్దని, ఇక్కడే వైద్యం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, తదితరులున్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో భారీ వర్షం

ఘట్‌కేసర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8.50 నుంచి 10 గంటల వరకు కురిసిన వర్షానికి రోడ్లన్నీ చెరువులయ్యాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గాలి, ఉరుములు, మెరుపులు లేకుండా ఏకదాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ పొందిన విద్యార్థులతో అకాడమీ నిర్వాహకులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. పలు పతకాలను సొంతం చేసుకున్నారు. పది సంవత్సరాల లోపు కేటగిరీలో నిర్వహించిన పోటీల్లో బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. అండర్ 14 విభాగంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో లికిత బంగారు పతకాన్ని సాధించింది. ఈ మేరకు పతకాలు సాధించిన విద్యార్థులను అకాడమీ కోచ్ జి.సాయికుమార్, టీమ్ మేనేజర్ వీరభద్ర అభినందించారు.

ఆశలు వర్షార్పణం



కొడంగల్ రూరల్: భారీ వర్షాలకు అన్నారం శివారులో దెబ్బతిన్న పెసర పంట

- పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- వందల ఎకరాల్లో పాడైన పంటలు
- కూరగాయ పంటలకు తీవ్ర నష్టం
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

బషీరాబాద్/కొడంగల్ రూరల్/పూడూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కూరగాయల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వరద నీటికి పొలాల్లో మేటలు కట్టాయి. వర్షపు నీరు నిలవడంతో పంటపొలాలు దెబ్బతిన్నాయి. బషీరాబాద్ మండలంలోని క్యాద్గీరా, జీవన్గి, మైల్వార్, ఎక్మాయి, నవాంద్గీ తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతంలోని పొలాలు నీట మునిగి వందాల ఎకరాల్లో కంది. పత్తి, పెసర పంటలు పాడయ్యాయి. కాగ్నానది పరివాహక ప్రాంత

మిగతా 8వ పేజీలో...

పెసర పంటకు నష్టం

కొడంగల్ మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చేతికొచ్చిన పెసర పంట పొలంలోనే మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాత మంచిగా వచ్చి తెంపే దశకు వస్తున్న సమయంలోనే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో హార్వెస్టర్‌తో పంట కోయలేక కూలీలతో కోయించి రోడ్ల పైన ఆరబెట్టారు. ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలిచ్చేలా ఎదగాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్టీయూ(హెచ్) వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(హైదరాబాద్) వైస్‌చాన్స్‌లర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల 25వ గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులు రాణించాలన్నారు. యేటా విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ 2.7 లక్షలకు చేరిందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ సమాజ అవసరాలు తీర్చే పరిశ్రమల స్థాపనలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు శ్రీనిధి విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ కేటీ మహి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అందుబాటులో ఉన్న వసతులను ఉపయోగించుకొని రాణించాలన్నారు. అనంతరం బీటెక్‌లో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనిధి విద్యా సంస్థల సీఈవో అభిజిత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీహెచ్.శివారెడ్డి, విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుతంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని మేడ్చల్ ఏసీపీ శకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మేడ్చల్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసులకు సమాచాచం ఇవ్వాలని, మండపాల వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. గణపతి ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పోలీసులు, మున్సిపల్ అధికారులు చూసుకుంటారని తెలిపారు. నిమజ్జన ఊరేగింపునకు రూట్‌మ్యాప్ తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 25 మంది ఎంపిక

తాండూరు, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి):తాండూరులో ఆదివారం వికారాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ముగిశాయి. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్ పోటీల్లో విజేతలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నర్సిములు బహుమతులు అందజేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 25మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పీసీసీ ప్రధానకార్యదర్శి దారాసింగ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు, రాములు, స్థానికులు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న లొంక నర్సిములు

ప్రజలకిచ్చిన హామీని విస్మరించిన ఎమ్మెల్యే



గడ్డమల్లయ్యగూడ పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన కిషన్‌రెడ్డి

యాచారం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఓటర్లకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే రంగారెడ్డి నిలుపుకోలేదని, ఆయన పేదలకు భూములు పంచి తన నిజాయితీని నిలుపుకోవాలని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఫార్మాసిటీపై ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. ఆదివారం గడ్డమల్లయ్యగూడ పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే తాము హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీకి భూమి సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆ భూములన్నీ రైతులకు వాపసిస్తామన్న ప్రస్తుత ఎమ్మెల్యే హామీని మరిచారా? అని విరుచుకుపడ్డారు. ప్రజలంతా బాగుండాలని అమ్మవారికి మొక్కుకున్నట్టు చెప్పారు. ఆయనతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, యువజన విభాగం నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, అచ్చన దానయ్య, బాషయ్య తదితరులు ఉన్నారు.

సిద్ధులగుట్ట జాతర ప్రారంభం



ఆలయం వద్ద భక్తుల రద్దీ



భక్తులకు అన్నదానం

శంషాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని చారిత్రక వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్ధులగుట్ట)ఆలయంలో ఆదివారం జాతర వైభవంగా కొనసాగుతోంది. చెన్న బసవేశ్వరస్వామి ఆలయం నుంచి సిద్ధులగుట్ట వరకు దేవుడిని రథంపై ఉంచి శావ ఊరేగించి ఆలయ గర్భగుడిలో ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. కమిటీ సభ్యులు పూజలు చేశారు. జాతర మొదటి రోజు 60వేల మంది భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ ప్రారంభించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు పూజలకు హాజరయ్యారు. సోమవారం సైతం ఉత్సవాలు కొనసాగుతాయి.

విద్యా శాఖకు మంత్రిని నియమించాలి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన వివేకానందరెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు, విద్యార్థులకు సౌకర్యాల కల్పించేందుకు విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరినట్లు ఏబీవీపీ చేవెళ్ల సంయుక్త కార్యదర్శి కిచ్చన్నగారి వివేకానందరెడ్డి తెలిపారు. ఆదివారం చేవెళ్లలో ఓ వివాహానికి స్పీకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కలిశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్యార్థుల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని స్పీకర్‌కు తెలిపానని చెప్పారు. వెంటనే విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలని స్పీకర్‌ను కోరానని తెలిపారు.

తల్లిదండ్రులకు కుమారుల తులాభారం



తల్లిదండ్రులకు తులాభారాన్ని నిర్వహిస్తున్న కుమారులు

తాండూరు రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కనిపెంచిన తల్లిదండ్రుల రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని కుమారులు అన్నారు. చెంగోల్‌కు చెందిన 88ఏళ్ల గౌడి ఎల్లయ్య-సత్యమ్మ దంపతులకు నలుగురు కుమారులు శ్రీనివాస్, వెంకటేశం, సత్యం, విష్ణు ఉన్నారు. ఆదివారం తాండూరు ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నూతన గృహప్రవేశం చేశారు. వారు తమ తల్లిదండ్రులు ఎల్లయ్య, సత్యమ్మలకు దీర్ఘాయుష్షు పూజ, పాదపూజ, తులాభారం కార్యక్రమాలను నిర్వహించారు. తల్లిదండ్రులు భారం అని ఆశ్రమాల్లో చేర్పుతున్న ఈ కాలంలో కుమారులు వారి తల్లిదండ్రులను ఇంత బాగా చూసుకోవడం అందరికీ ఆదర్శనీయం అని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గౌడి మంజుల, మాజీ ఎంపీటీసీ, టీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశం, సత్యం, ఆర్‌పి వేణు, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొబైల్ క్లినిక్‌లతో ప్రజలకు వైద్య పరీక్షలు



మేడిగడ్డ తండాలో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ క్లినిక్‌ల ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో లక్ష మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. వన్‌మెడి సంస్థతో కలిసి వంద గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం మేడిగడ్డ తండాలో ఏర్పాటు చేసిన ఉచిత మొబైల్ క్లినిక్ శిబిరాన్ని రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. మేడిగడ్డ, శంకర్‌కొండ తండా, దయ్యాల బోడు తండాలు, సమీప గ్రామాల ప్రజలు సుమారు 700మందికి గుండె, లివర్, కిడ్నీ, షుగర్, కొలెస్ట్రాల్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ప్రజలతో ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. వైద్యపరీక్షలతో వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి వారం ఓ గ్రామంలో మొబైల్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 2028 వరకు కార్యక్రమం నిరంతరాయం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఫౌండేషన్‌ద్వారా 426మందికి కంటి ఆపరేషన్లు, 8,256 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యకరమంలో చెంచు సేవాసంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు,ఫౌండేషన్ సభ్యులు, నాయకులు శ్రీరాములు, అభినవ్‌రెడ్డి, మల్లేశ్, కొండల్, రాజశేఖర్, కృష్ణ, పురుషోత్తం, చంద్రు, కిషన్, నవీన్, కుమార్, తావుర్య, టాక్య పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



ధారూరు, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ధారూరులోని వీరభద్రేశ్వరాలయంలో ఆదివారం లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివలింగానికి రుద్రాభిషేకం, స్వామి వారికి లక్ష మారేడు బిల్వాలతో అర్చన, కపిలేశ్వర, పార్వతీదేవి కల్యాణం నిర్వహించారు. అమ్మవారిని శాకంబరి మాతగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం, వీరభద్రేశ్వరస్వామి పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు.



శాకంబరిగా అమ్మవారి అలంకరణ

సంబరంగా తీజ్ ఉత్సవం



కడ్తాల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ తండాలో ఆదివారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రామావత్ బిచ్యానాయక్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మొలకల బుట్టలను ఆలయాల్లో పూజలు చేశారు. పెళ్లికాని యువతులు, చిన్నారులు మొలకల బుట్టలతో తండాలో ఊరేగింపు నిర్వహించారు. నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలు మధ్య మొలకల బుట్టలను తండాల సమీపంలోని చెరువుకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రావు, సేవ్య, పాండు, శ్రీను, గణేశ్, జయరామ్, హరి, రాజు, దశరథ్, లక్ష్మీరామ్, కృష్ణ, కమ్లీ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- పూజలకు ఏకదంతుడి విగ్రహాలు సిద్ధం
- ఎత్తును బట్టి రూ.5వేల నుంచి రూ.60వేలు పలుకుతున్న ధర
- ఇప్పటికే మండపాల నిర్వాహకుల ఆర్డర్లు
- నాలుగైదు రోజుల్లో జోరుగా అమ్మకాలు



పరిగిలో అమ్మకానికి ఉంచిన గణేశ్ విగ్రహాలు

పరిగి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గణేశ్ పండుగకు ఇంకా పది రోజులున్నా ఇప్పటి నుంచే మండపాల నిర్వాహకులు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. హిందువులు సామూహికంగా, ఆర్భాటంగా జరుపుకునే పండుగల్లో వినాయక చవితి ముఖ్యమైనది. గణేశ్ ఉత్సవాలను పట్టణాలు, గ్రామాల్లో చవితి మొదలు ఐదు రోజుల నుంచి పదకొండు రోజుల వరకు నిర్వహించుకుంటారు. ఇప్పటికే మార్కెట్లో వినాయక విగ్రహాలు కొనుగోలు చేస్తున్నారు. యువత, కుల సంఘాల ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహాల కొనుగోళ్లకు చందా వసూలు చేయడం, కొందరు సొంతంగా ఏర్పాటు చేయడం వంటివి సహజం. చాలా మంది మండపాల నిర్వాహకులు ఇప్పటికే విగ్రహాలకు ఆర్డర్లిచ్చారు.

వివిధ రూపాల్లో గణేశుడి ప్రతిమలు

గతంలో పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో చాలా మట్టుకు తక్కువ ఎత్తు విగ్రహాలు విక్రయించేవారు. ఈ సారి పెద్ద గణేశ్ విగ్రహాలను తయారు చేశారు. పరిగిలోని షాద్‌నగర్ రోడ్డులో, కొడంగల్ చౌరస్తాలో విగ్రహాల అమ్మకాలు సాగిస్తున్నారు. వివిధ ఆకృతులు, ఆకట్టుకునే రూపాల్లో వినాయక విగ్రహాలను తయారు చేశారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్, మోమిన్‌పేట్, కులకచర్ల ప్రాంతాల్లోనూ వందల్లో విగ్రహాలను రెడీ చేశారు. కొందరు హైదరాబాద్ నుంచి కూడా విగ్రహాలు తెచ్చి స్థానికంగా అమ్ముతున్నారు. జిల్లాలో 50కిపైగా గణేశ్ విగ్రహాల షాపులను తెరిచారు. ప్రతీ సీజన్‌లో రూ.2కోట్ల నుంచి 3కోట్ల విగ్రహాల వ్యాపారం జరుగుతుంది. ఈ సారి విగ్రహాల ధరలు పెరిగాయి. ముడిపదార్థాల రేట్ల పెంపుతో ధరలు పెంచేశారు. ఒక్కో విగ్రహానికి గతేడాది కంటే 20శాతం నుంచి 30శాతం ధర పెరిగింది. వివిధ పట్టణాల్లో రూ.5వేల నుంచి రూ.60వేల రేటు ఉన్న విగ్రహాలు అమ్ముతున్నారు. వినాయక చవితి ఈ నెల 27న ఉంది. కాగా ఇప్పటి నుంచే విగ్రహాలను వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు.

గ్రామాలకు తరలుతున్న ప్రతిమలు



కొడంగల్ రూరల్: రెండు, మూడు నెలల నుంచి తయారు చేసిన వినాయక విగ్రహాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించేదుకు నిర్వాహకులు వాటిని వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగ ఉండడంతో విగ్రహాలను కొనుగోళు చేసి నిర్వాహకులు గ్రామాలకు తరలిస్తున్నారు. ఆదివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా మీదుగా వినాయక విగ్రహాలను తరలించారు.

మట్టి విగ్రహాలపై మొగ్గు చూపాలి



చేవెళ్ల: వినాయక విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవే ఎక్కువగా ఉంటున్నాయి. మండపాల నిర్వాహకులు కూడా రంగు వినాయకులనే ఇష్టపడుతున్నారు. వాటి నిమజ్జనంతో నీటి కాలుష్యం పెరుగుతోంది. బంకమట్టితో విగ్రహాల తయారీకి ఓపిక, నైపుణ్యం అవసరం. ఓ పెద్ద విగ్రహం చేయాలంటే 10రోజుల సమయం పడుతుంది. పైగా మట్టి విగ్రహాలకు ఎక్కువ ధర పెట్టి కొనేందుకు చాలా మంది ఆసక్తి చూపరు. దీంతో కళాకారులు కూడా పీవోపీ ప్రతిమల తయారీకే మొగ్గు చూపుతున్నారు. పీవోపీ విగ్రహాల తయారీ సులువు, ఖర్చు తక్కువే. విభిన్న ఆకృతుల్లో, ఆకర్షణీయంగా రంగులద్ది ఆకట్టుకునేలా విగ్రహాలు తయారు చేస్తారు. ఇప్పటికే పీవోపీ పెద్ద విగ్రహాలు అమ్మకానికి సిద్ధం చేశారు. గణేశ్ విగ్రహాల తయారీకి వినియోగించే రసాయనాలు, రంగులతో కలిగే అనర్థాల గురించి పట్టించుకోకుండా ఆకర్షణకే ప్రాధాన్యత ఇవ్వడంపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీవోపీ విగ్రహాలు చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితమవుతుంది. జలచరాలు చనిపోతాయి. మనుషులు ఆ నీటిలో మునిగితే చర్మ, నాడీ సంబంధ వ్యాధులొస్తాయని వైద్యులు చెబుతున్నారు. మట్టి విగ్రహాలతో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కాగా కొందరు మట్టి వినాయకులనూ ప్రతిష్ఠిస్తున్నారు.



గతేడాది చేవెళ్లలోని ఆలయ పుష్కరిణిలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల తొలగింపు(ఫైల్)

ఈ సారి అమ్మకాలు బాగున్నాయి



పౌడర్లు, అద్దకం రంగుల ధరలు పెరిగాయి. గతేడాదితో పోలిస్తే 10శాతం నుంచి 15 శాతం రేట్లు పెరిగాయి. గణేశ్ విగ్రహాల అమ్మకాలతో రెండు నెలలు మాకు పని ఉంటుంది. కళాకారులకు ఉపాధి లభిస్తోంది. అయితే ధరలు పెరిగినా మాకు ఆర్డర్లు బాగానే వచ్చాయి. మరో నాలుగైదు రోజుల్లో అమ్మకాలు ఊపందుకుంటాయి.

– మైపాల్, గణేశ్ విగ్రహాల కళాకారుడు, పరిగి

ఇప్పటికే బుక్ చేసుకున్నాం



తిరుమల రెసిడెన్సీలో గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. ఈ సారి ఇప్పటికే గణేశ్ విగ్రహాన్ని బుక్ చేసుకున్నాం. ఈ సారి వర్షాలు బాగా పడడంతో నిమజ్జనానికి నీటి వనరుల్లో నీరు బాగా చేరింది. కాబట్టి ప్రతీ గల్లీలో వినాయకులు పెట్టుకుంటారు. మేం ఈ సారి గణేశ్ ఉత్సవాలను గతం కంటే భిన్నంగా జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. ప్రతి ఏటా వినాయక విగ్రహాల రేట్లు పెరుగుతున్నాయి.

– బి.విష్ణువర్ధన్‌రెడ్డి, తిరుమల రెసిడెన్సీ, పరిగి

రసాయన, రంగుల విగ్రహాలతో అనర్థాలు



రసాయనాలు, రంగుల వల్ల కలిగే అనర్థాలు ఎక్కువ. పీవోపీ, ఇతర కృత్రిమ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటే పుణ్యం వస్తుంది. కాలుష్యం కూడా తగ్గుతుంది. రసాయనాలతో నీరు కలుషితమవుతుంది. జలచరాలు ప్రాణాలు చనిపోతాయి. సహజత్వంతో కూడిన మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు ముందుకు రావాలి. ఓ ఉద్యమంలా అంతా మట్టి వినాయకులనే పూజించాలి.

– రామకృష్ణారావు, పర్యావరణ అవార్డు గ్రహీత

బొంరాస్‌పేట్‌కు నిలిచిన రాకపోకలు

- తాత్కాలికంగా పూర్తయిన వంతెనపై వాహనాల నిషేధం
- చుట్టూ ఆరు కిలో మీటర్లు తిరిగిపోతూ ప్రజల ఇక్కట్లు



అలుగు కాల్వ వంతెన వద్ద వేచి ఉన్న స్థానికులు



అలుగు కాల్వ నుంచి వస్తున్న వరద

బొంరాస్‌పేట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి ఎగువన ఉన్న కాకరవాణి ప్రాజెక్టుతో పాటు మెట్లకుంట, బొంరాస్‌పేట్ చెరువులు అలుగు పారుతున్నాయి. వరద నీరు తుంకిమెట్ల, బొంరాస్‌పేట్ మధ్యలో గల అలుగు కాల్వ వంతెన వద్ద వరద ఉధృతితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి బొంరాస్‌పేట్-తుంకిమెట్లకు రాకపోకలు నిలిచిపోయాయి. అలుగు కాల్వ(కూలిపోయిన కెనాల్) వద్ద వరద ఉధృతికి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. వంతెన నిర్మాణంలో భాగంగా స్లాబ్ పూర్తయినా కాంట్రాక్టర్ ఆ వంతెనపై నుంచి వెళ్లకుండా అడ్డుకుంటున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. వంతెనపై స్లాబ్ వేసి నెల రోజులు గడుస్తున్నా రాకపోకలను ఎందుకు అనుమతించడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వరద ఉధృతితో పోలీసులు బారికేడ్లు పెట్టి ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. మూడు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కూతవేటు దూరంలో ఉన్న తుంకిమెట్ల హైవేకు వెళ్లాలంటే బొంరాస్‌పేట్ నుంచి మెట్లకుంట, బుర్రితండా మీదుగా వెళ్లాల్సి వస్తోంది. అర కిలోమీటర్ దూరానికి ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే వంతెనపై నుంచి రాకపోకలకు అనుమతివ్వాలని వారు కోరుతున్నారు.

తాండూరులో జోరు వాన

తాండూరు/నవాబుపేట: తాండూరులో ఆదివారం సాయంత్రం జోరువాన కురిసింది. పట్టణంలోని కూరగాయల మార్కెట్, భద్రేశ్వరచౌక్, వినాయక్‌చౌక్, ఇందిరాచౌక్ ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరద పారింది. భారీ వర్షాలకు నవాబుపేట మండలం అక్నాపూర్‌నకు చెందిన ఖైరున్నీసాబేగం ఇల్లు కూలింది. తనకు గూడు లేకుండా పోయిందని వాపోయింది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు

వికారాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయడం లేదని, పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు విమర్శించారు. ఆదివారం వికారాబాద్‌లో బీజేపీ నాయకుడు రాజేందర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజలను మోసం చేసిందని, అదే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, కొడంగల్ మీదనే దృష్టిపెట్టారని విమర్శించారు. వికారాబాద్‌కు నిధులు ఇవ్వడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ నియోజకవర్గానికి నిధులు తేలేని పరిస్థితి ఉందన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 19న వికారాబాద్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రానున్నారని, ఆయనకు ఘన స్వాగతం పలుకుతామన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, రమేష్, పాండు, కేపీరాజు, విజయభాస్కర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

పాపన్న విగ్రహం ఏర్పాటు హర్షనీయం

- గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం మల్లికార్జున్‌గౌడ్

వికారాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు గొప్ప విషయం అని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. భూమి పూజ చేయనున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సోమవారం గౌడ కులస్తులు ఉదయం 10గంటలకు హైదరాబాద్ చేరుకోవాలని పిలుపునిచ్చారు.

పోస్టుపోన్?

(ఐదో పేజీ తరువాయి)



ఆ దిశగా చర్యలు చేపట్టింది. అయితే ఎన్నికలకు ముందు పార్టీ పదవులను ప్రకటిస్తే ఆశావహులు కొందరు నిరాశ చెందే ప్రమాదముందని అధిష్ఠానం భావిస్తోంది. ఇంతకు ముందు పార్టీ పదవుల్లో నేరుగా నియమించేవారు. గతానికి భిన్నంగా ఈ సారి ఆశావహుల దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు తీసుకొని నెల రోజులు కావొస్తున్నా ఎలాంటి నియామకాలు చేపట్టలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యేందుకు కనీసం రెండు నెలలు గడువు పట్టే అవకాశం ఉంది. ఇవి ముగిసే వరకు పాత కమిటీలనే కొనసాగిస్తారా..? లేదా తాత్కాలిక(అడ్‌హక్) కమిటీలను నియమిస్తారా? అనేది స్పష్టత రాలేదు.

పార్టీ పదవులకు బ్రేక్!

పార్టీ, నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి నుంచి నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు తీసుకున్నారు. ఆయా జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే సమక్షంలో వీటిని స్వీకరించారు. పార్టీ ఎమ్మెల్యే లేనిచోట్ల నియోజకవర్గ ముఖ్య నేతకు అందజేశారు. జిల్లా, బ్లాక్, పట్టణ, మండల స్థాయి పార్టీ పదవులకు దరఖాస్తులు స్వీకరించారు. మునిసిపాలిటీల్లో పట్టణ అధ్యక్ష పదవితో పాటు అనుబంధ సంఘాల పదవులకు దరఖాస్తులు స్వీకరించారు. పార్టీని నమ్ముకొని పని చేస్తున్న నాయకులు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ, మండల, డివిజన్, మునిసిపాలిటీ, జిల్లా స్థాయి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ముఖ్య నేతలతో సిఫారసు చేయించుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగానే స్థానిక ఎన్నికలు 90 రోజుల్లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీంతో పీసీసీ చీఫ్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పదవుల భర్తీకి తాత్కాలిక బ్రేక్ పడిందన్న చర్చ జరుగుతోంది.

అసంతృప్తిలో ఆశావహులు

పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నాం. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. ఇంకా పదవులు రాక పాయె. అని ఆశావహులు నిరాశ చెందుతున్నారు. అయితే నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నారు.

డీసీసీ పీఠంపై ఆశలు

జిల్లా కాంగ్రెస్ పార్టీలో మండల, బ్లాక్ జిల్లా అధ్యక్ష పదవులపై నేతల్లో పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందని పార్టీ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికలోనూ డీసీసీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొనడంతో అందరి దృష్టి ఇప్పుడు డీసీసీ కమిటీలపై పడింది. కొందరు నేతలు తమ అనుచరులను డీసీసీ పీఠంపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష రేసులో అనేక మంది పేర్లు వినిపిస్తున్నా సీనియారిటీ, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం, ఆర్థిక, అంగబలం ఉన్న నేతలకు పగ్గాలు అప్పగించాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. డీసీసీ రేసులో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, శంషాబాద్‌కు చెందిన రాచమళ్ల సిద్ధేశ్వర్, వేణుగౌడ్‌లు ఉన్నారు.

సీనియర్లకు ప్రాధాన్యం?

కాంగ్రెస్ పార్టీ ఈ సారి ఎన్నికల్లో కొత్త ట్విస్ట్ ఇచ్చింది. సంస్థగతంలో అధిష్ఠానం కొత్త మెలిక పెట్టింది. 2017, అంతకు ముందు నుంచి పార్టీలో పనిచేస్తున్న వారికి పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నేతలకు సూచించారు. దీంతో కీలక పదవులు సీనియర్లకు దక్కే అవకాశం ఉంది.

ఓ మై డాగ్

(ఐదో పేజీ తరువాయి)

వీధిలో ఉండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో అనంతయ్య కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని కార్గిల్ కాలనీ తదితర ప్రాంతాల్లో మరో ఆరుగురిపై దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన వారికి కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్ మాట్లాడుతూ వీధి కుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


బషీరాబాద్‌లో గుంపుగా వీధి కుక్కలు

వెంబడిస్తున్న వీధి కుక్కలు

గ్రామాల్లో రోజురోజుకూ శునకాల బెడద అధికమవుతోంది. రాత్రుళ్లు ద్విచక్ర వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. బషీరాబాద్ మండలంలోని బషీరాబాద్, మైల్వార్, జీవన్గి, కాశీంపూర్, మంతట్టి తదితర గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పగాలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై వాహనాలకు అడ్డుగా వస్తున్నాయి. శనివారం మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో చిన్నారులు, మహిళలపై శునకాలు దాడి చేసిన ఘటనను చూశాం. మనుషులనే కాకుండా మేకలు, గొర్రెలు, కోళ్లు తదితర జీవాలపై కూడా కుక్కలు గుంపుగా దాడికి దిగుతుండటంతో ప్రజలు భయందోళనలో చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామ సింహాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణపనులను వేగవంతం చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఈ రోడ్డు నిర్మాణ ప్రగతి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యతను పాటించాలని నిబంధనలు అతిక్రమిస్తే బిల్లులు నిలిపివేయిస్తామన్నారు.

ప్రశాంతంగా సొసైటీ ఎన్నికలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి పరిధిలోని సాకేత్ ప్రణామం సొసైటీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. సొసైటీ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రత్నం, ప్రధాన కార్యదర్శిగా వల్లభేంద్ర రెడ్డి, జాయింట్ సెక్రటరీగా శకుంతలా దేవి, కోశాధికారిగా శ్రీరంగారావులతో పాటు పూర్ణచంద్రశాస్త్రి, భద్రినాథ్, శేషసాయి, ఇందిర కుమారి, నరసింహమూర్తి, సజ్జాబాబు తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మహ్మద్ తారిఖ్ హస్సేన్ వ్యవహరించారు.

రాజ్యాధికారం సాధించాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కలలు గన్న విధంగా బడుగులు రాజ్యాధికారం దిశగా ముందడుగు వేయాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్ కుమార్, మర్పల్లిగూడ గ్రామ మాజీ పంచాయతీ సభ్యుడు చిలుగూరి ఆనంద్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహంకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసు, రాజేష్, రాందాస్, సత్యం, రవి, శ్రీకాంత్, అంజయ్య, గణేష్, శేఖర్ పాల్గొన్నారు.

ఎంఈవోకు పీఆర్‌టీయూ సన్మానం

పెద్దేముల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మండల ఎంఈవో నర్సింగ్‌రావు జిల్లా ఉత్తమ విద్యాధికారిగా అవార్డును అందుకున్న సందర్భంగా ఆదివారం పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షులు పోల నవీన్‌కుమార్, ప్రధానకార్యదర్శి వెంకటరెడ్డి, గడ్డిగోపాల్, శ్రీనివాస్, బంధప్ప, శివ కుమార్, సురేష్, కృష్ణ పాల్గొన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

- తాండూరు-వికారాబాద్ మార్గంలో అసంపూర్తిగా రోడ్డు పనులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం
- దుమ్ము, ధూళితో వాహనదారుల అవస్థలు

తాండూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కొత్త రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్వేశారు. కంకర పరిచిన కాంట్రాక్టర్ పనులను వదిలేశాడు. దీంతో అప్పటి వరకు సాఫీగా ప్రయాణం సాగిస్తున్న ప్రయాణికులకు కష్టాలు మొదలయ్యాయి. ఇది తాండూరు-వికారాబాద్ రోడ్డు మార్గంలో దుస్థితి. దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం కావడంతో రోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డు వెంబడి వెళ్తుంటాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు హైదరాబాద్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడంలేదు. సిమెంటు, నాపరాయి వంటి భారీవాహనాలు ఈరోడ్డు వెంబడి వెళ్తుంటాయి. ఈ క్రమంలో విపరీతమైన దుమ్ము రేగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాంజపూర్ గేటు నుంచి కందనెల్లి గ్రామ శివారులో ఉన్న


వాహనాలు వెళ్తుంటే రేగుతున్న దుమ్ము

జీపీఆర్ ఫంక్షన్‌హాల్ వరకు తారు రోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ కంకర పర్చి నాలుగు నెలలు గడిచిపోయింది. ద్విచక్ర వాహనదారులు కంకరపై వాహనాలు నడపలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రయత్నం చేసి నిధులు రాబట్టగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అభివృద్ధికి తూట్లు పొడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధి బంధువు కావడం వల్లే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, అధికారులు సైతం ఏమీ అనలేని పరిసితి ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డును తవ్వి పరిచిన కంకర

వర్షాలు తగ్గగానే పనులు చేపడుతాం



వర్షాలు తగ్గగానే రోడ్డు పనులు నిర్విరామంగా కొనసాగుతాయి. ప్రజలకు ఇబ్బందులు రాకుండా పనులు చేయిస్తాం. రూ.101కోట్లు ఈరోడ్డు మార్గానికి మంజూరయ్యాయి. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు పనులు చేశాం. మిగతా పనులను త్వరలో చేపడుతాం.

- శ్రావణ్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ, తాండూరు

జాతరకు ఆలయాల ముస్తాబు


పెద్దేముల్: తట్టెపల్లి అటవీప్రాంతంలో అంబురామేశ్వర దేవాలయం


కులకచర్ల పాంబండ ఆలయం

పెద్దేముల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): తట్టెపల్లి అటవీప్రాంతంలో వెలసిన అంబురామేశ్వర ఆలయంలో నేడు జాతర ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతీ ఏడాది శ్రావణమాసం చివరి సోమవారం ఇక్కడ అంబురామేశ్వర జాతర జరుగుతుంది. శ్రావణమాసం చివరలో నిర్వహించే అంబురామేశ్వర జాతరకు వికారాబాద్ జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. శ్రావణమాసంలో ఉపవాసదీక్షలు చేసిన వారు ఇక్కడ అంబురామేశ్వరుడి దర్శనానంతరం ఉపవాసదీక్షలు విరమస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

జాతరకు పాంబండ ఆలయం ముస్తాబు

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ ఆలయం చిన్నజాతర ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం శ్రావణమాసం చివరి సోమవారం చిన్న జాతర జరుగుతోంది. జాతర నిర్వహణకు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్యలు ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రావణమాసం ఉపవాస దీక్షలు ఉన్న వారు సోమవారం పాంబండపై నిద్రచేసి మంగళవారం ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ప్రతీ సంవత్సరం పాంబండ జాతర రెండు పర్యాయాలు జరుగుతుంది.

నేడు రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఎమ్మెల్యే

తాండూరు రూరల్: జినుగుర్తి రామలింగేశ్వరస్వామి ఆలయ 42వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నేడు(సోమవారం) తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు పడుగాన్ ఉత్తంచంద్ తెలిపారు. శ్రావణమాసం చివరి సోమవారం రోజున స్వామివారి ఆలయ వార్షికోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఉట్టి కొడుతున్న యువకులు

కొడంగల్: కొడంగల్ పట్టణంలోని చితారు పెరుమాళ్ల ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో చితారు పెరుమాళ్ల భజన భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంగా బాలగోకులం

తాండూరు: తాండూరు పట్టణంలో భవాని నగర్‌లోని రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం బాలగోకులం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిత్యం శ్లోకాలను పఠించారు. ఆధ్యాత్మిక అంశాలను ఉపాధ్యాయులు బోధించారు. ఆటపాటలతో అలరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, జయ తదితరులు పాల్గొన్నారు.


శ్లోకాలు పఠిస్తున్న చిన్నారులు

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుద్యాల: ఆలేడ్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, హోమం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆశలు వర్షార్పణం

(ఐదో పేజీ తరువాయి)

గ్రామాలైన గంగ్వార్, నవాంద్గీ, ఇందర్‌చెడ్ శివారులో నది ఉప్పొంగి ప్రవహించడంతో 150 ఎకరాలకుపైగా పొలాలు వరద నీటి ముంపునకు గురైనట్లు రైతులు వాపోతున్నారు. కంది, పత్తి, పెసర పంటలన్నీ రోజుల తరబడి నీటిలో మునిగి ఉండడంతో భారీగా నష్టం వాటిల్లిందని రైతన్నలు లబోదిబోమంటున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పంటలన్నీ పూర్తిగా దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రూ.వేలాల్లో పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టించిన పెసర పంటలు చేతికొచ్చే సమయంలో వర్షార్పనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వరదతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట నష్టంపై సర్వే చేసినా ఆశించిన మేర ప్రతిఫలం రావడం లేదని ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాలకు రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.


పూడూరు: వర్షాలకు పాడైన పంటలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కమిటీ సభ్యుడు రామకృష్ణ

రూ.లక్ష పరిహారమివ్వాలి

భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.1లక్ష చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పూడూరు మండల పరిధిలోని కంకల్, పుడుగుర్తి, చింతపల్లి, రాకంచర్ల తదితర గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాలకు మండల పరిధిలో వెయ్యి ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. తెగిపోయిన రోడ్లు, వాగులు వంకలు, కాల్వలు మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, మహిపాల్, నవీన్, నాములు, యాదయ్య, తిరుమలయ్య, తిరుమలయ్య, పెంటయ్య, రాజు, నర్సింహులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి


కీసర: మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు


శామీర్‌పేట: మాట్లాడుతున్న సీఐ విజయవర్ధన్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అనుమతితోనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని ఘట్‌కేసర్ సీఐ ఎం.బాలస్వామి తెలిపారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగల సమయంలో అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు శేఖర్, రాఘవేంద్ర, హీన, పోలీస్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కీసర: ప్రజలు శాంతియుత వాతావరణంలో పండుగలు జరపాలని కీసర పోలీస్‌స్టేషన్ సీఐ ఆంజనేయులు అన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఆదివారం సీఐ ఆధ్వర్యంలో కీసర పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి అన్నారు. డీజే ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా నియమ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశ్, హరిప్రసాద్‌లు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేట: తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామస్వామి ఆలయం వద్ద పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేందర్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యుడు బీమిడి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పట్నం నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు నర్సింగరావుగౌడ్, హరిక్రిష్ణ, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు హిందూ ఉత్సవ సమితి సమావేశం

వికారాబాద్: రాబోయే వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వికారాబాద్ హిందూ ఉత్సవ సమితి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ కృష్ణపంతులు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక రామ మందిరంలో సమావేశం ఉంటుందని, ఆయా వినాయక మండపాల నిర్వాహకులు, ఆయా పార్టీల ముఖ్యనాయకులు సకాలంలో విచ్చేయాలని ఆయన కోరారు.


ఘట్‌కేసర్ రూరల్: మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

చౌడాపూర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 విద్యాసంవత్సరానికి హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఎడ్‌తో పాటు టెట్ ఉండాలని తెలిపారు. అదేవిధంగా పారిశుధ్య కార్మికురాలి కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తలిపారు. మరిన్ని వివరాలకు 9948115437 సెల్ నంబరుకు సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

దోమ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్‌కాంత్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

బషీరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన బషీరాబాద్(నవాంద్గీ) రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం వెలుగుచూసింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వీరేశం తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి(35) నవాంద్గీ స్టేషన్ పరిధిలోని గ్యాస్‌గోదాం సమీపంలో పట్టాలపై దుర్మరణం పాలై ఉండగా సిబ్బంది రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతుడి తల, మొండెం, శరీర భాగాలు నుజ్జయి చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి ఒంటిపై నల్లప్యాంటు, టీషర్టు ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. కాగా ఘటనా స్థలంలో మృతికి సంబంధించి ఆనవాళ్లను చూస్తే శనివారం రాత్రివేళలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పట్టాలపై పడిన మృతుడి శరీర భాగాలను సేకరించి శవాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వీరేశం వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మొగులయ్య (ఫైల్)

దౌల్తాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): టిప్పర్-బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య (28) గత కొంత కాలంగా కోస్గిలోని తన అత్తగారి పొలం దగ్గర కూరగాయల సాగుతో భార్య, పిల్లలతో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పని నిమిత్తం కోస్గి బస్టాండ్ నుంచి శివాజీ చౌరస్తా వైపు బైక్‌పై వెళ్తుండగా మట్టి లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో మొగులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోస్గి ఎస్సై బాల్‌రాజ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

బొంరాస్‌పేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని మహంతీపూర్ గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ఆదివారం పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ల యజమానులు అంజిలయ్య, శ్రీకాంత్‌పై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తుదిదశకు వరినాట్లు


కాశీంపూర్ వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

బషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వరిసాగు తుదిదశకు చేరుకుంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లు జోరందుకున్నాయి. బషీరాబాద్ మండలం మైల్వార్, నీళ్లపల్లి, కాశీంపూర్, నవాల్గ, నవాంద్గీ, దామర్‌చెడ్, పలు గిరిజన తండాల్లో వరినాట్ల పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో వెనకబడిన రైతుల వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జూన్, జూలైలోనే నాట్లు వేసిన రైతులు మొక్క బలంగా పెరిగేందుకు మందు చల్లే పనుల్లో బిజీబిజీగా కనిపించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన విఠల్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

బషీరాబాద్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి తండ్రి, బీఆర్ఎస్ నేత పంజుగుల విఠల్‌రెడ్డి ఆదివారం బషీరాబాద్‌లోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు ప్రస్తుత రాజకీయాలపై ఇష్టాగోష్టిగా చర్చించుకున్నారు. పాత రోజుల్లోని రాజకీయాలను నెమరువేసుకుంటూ భవిష్యత్ కార్యాచరణపై విశ్లేషణాత్మకంగా కొంతసేపు మట్లాడుకున్నారు. రాబోవు రోజుల్లో మీ సహకారం ఉండాలని మాజీ ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు, పి.పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు రజాక్, డి.నర్సింహులు తదితరులున్నారు.

చాకలి కుంటను కలుషితం చేయొద్దు


చాకలి కుంటలో పైప్‌లైన్ పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్

కీసర, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): చాకలికుంటలో మురుగునీరు పైపులైన్ కలిపి కలుషితం చేస్తే సహించేది లేదని కీసర గ్రామానికి చెందిన రజకులు కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ఆదివారం గుట్టు చప్పుడు కాకుండా పాత ఎంపీడీవో భవనం ఏర్పాటుచేస్తున్న నవోదయ పాఠశాలకు సంబంధించిన మురుగునీరు పైప్ లైన్‌ను సదరు కాంట్రాక్టర్ దిగువ ప్రాంతంలో ఉన్న చాకలి కుంటలో కలిపేందుకు పైపులైన్‌ను వేస్తున్నాడు. సమాచారం అందుకున్న కీసర రజకులు పైప్‌లైన్ పనులను అడ్డుకున్నారు. గత కొన్నేళ్లుగా వృతి పరంగా చాకలి కుంటపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నాయని, స్వచ్ఛమైన నీటిని కలుషితం చేస్తే, వృత్తి పరంగా తమ మనుగడ ఎలా అని ప్రశ్నించారు. కుంట చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలే ఉండగా ఎల్లప్పుడు అందుబాటులో ఉండే అధికారులు, స్నేహకాలనీవాసులు నివాసముంటున్నారని తెలిపారు. కుంటను కలుషితం చేస్తే, అధికారులతో పాటు ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. దీంతో అధికారులు మీతో చర్చిస్తారని కాంట్రాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎవరైనా కుటను కబ్జా గానీ, కలుషితంగానీ చేస్తే సహించేది లేదని రజకులు తేల్చిచెప్పారు.